క్లుప్తంగా

కూర్మనారాయణస్వామికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో కూర్మనారాయణస్వామి

ఆస్పరి: మండలంలోని హలిగేర గ్రామ సమీపంలోని కొండల్లో వెలసిన కూర్మనారాయణ స్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారికి గంగాభిషేకం, ఆకుపూజ, మంగళహారతులు తదితర కార్యక్రమాలు చేపట్టారు. వివిధ ప్రాంతాల భక్తులు స్వామి వారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం



విరాళాన్ని అందజేస్తున్న పురుషోత్తం

మద్దికెర : మండలంలోని ఎం.అగ్రహారం గ్రామంలో నిర్మిస్తున్న శ్రీకృష్ణ దేవాలయ నిర్మాణానికి జెడ్పీటీసీ మాజీ సభ్యుడు పురుషోత్తం చౌదరి రూ.1,16,000 విరాళంగా శనివారం అందజేశారు. ఈ సందర్భంగా దాతను ఆలయ నిర్వాహకులు సన్మానించారు. ఆయన మాట్లాడుతూ దేవాలయాలను కాపాడుకోవడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. గ్రామస్తులు రామాంజనేయులు, రమేష్, రఘునాథరెడ్డి పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న మునెప్ప

పత్తికొండ రూరల్ : ప్రభుత్వ కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో విధులు నిర్వర్తిస్తున్న ఉద్యోగులు, కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఏపీ మెడికల్ కాంట్రాక్ట్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు మునెప్ప, జిల్లా డిప్యూటీ సెక్రెటరీ కృష్ణయ్య ప్రభుత్వాన్ని కోరారు. శనివారం స్థానిక ప్రభుత్వాసుపత్రి ఆవరణలో ఏర్పాటు చేసిన ఉద్యోగులు, కార్మికుల సమావేశంలో వారు మాట్లాడారు. శానిటేషన్ కార్మికులకు రూ.16వేలు వేతనం ఇవ్వాలన్నారు. సెక్యూరిటీ గార్డ్స్‌కు రూ.11వేలు కంటే తక్కువ వేతనాలు చెల్లించడం దారుణమన్నారు. ఆసుపత్రి సిబ్బంది దేవయ్య, ఆనంద్, భూషయ్య, సుబాన్, గురుస్వామి, చంద్రకళ పాల్గొన్నారు.

హాస్టల్‌కు మెష్ విరాళం



కిటికీలకు మెష్ ఏర్పాటు చేయిస్తున్న దృశ్యం

వెల్దుర్తి(కృష్ణగిరి): వెల్దుర్తి మండల కేంద్రంలోని బీసీ బాలికల హాస్టల్‌కు స్థానిక జెడ్పీ హైస్కూల్ 1989–90 పదవ తరగతి పూర్వ విద్యార్థుల సహకారంతో దోమల నివారణకు శనివారం రూ.16వేల విలువజేసే మెష్ (జాలి)ని హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ శైలజకు అందించారు. పూర్వ విద్యార్థి, ప్రైవేట్ హిందీ పండిట్ గఫూర్, హెల్పింగ్ హ్యాండ్స్ సొసైటీ అధ్యక్షుడు హరిసింహనాయుడు మాట్లాడుతూ ఆస్ట్రేలియాలో ఉద్యోగం చేస్తున్న వెల్దుర్తికి చెందిన యు.కృష్ణమూర్తి రూ.10వేలు అందజేశారని చెప్పారు.

అనారోగ్యంతో గ్రామ సేవకుడు మృతి



మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం అందిస్తున్న దృశ్యం

హొళగుంద: హెబ్బటం గ్రామ సేవకుడిగా పని చేస్తున్న తలారి పెద్ద తిక్కయ్య (56) అనారోగ్యంతో శుక్రవారం రాత్రి మృతి చెందాడు. కొద్ది రోజుల నుంచి పెద్ద తిక్కయ్య అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం తీవ్ర అస్వస్థతకు గురై మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. తిక్కయ్య మృతికి తహసీల్దార్ ప్రసాద్‌రాజు, ఆర్‌ఐ దినేష్, వీఆర్‌ఓ లక్ష్మీనారాయణరెడ్డి తదితరులు సంతాపం తెలియజేశారు. వీఆర్‌ఏ సంఘం నాయకులు మల్లయ్య, సిద్దలింగ, మౌలాలి తదితరులు శనివారం గ్రామానికి వెళ్లి మృతదేహానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించి అంత్యక్రియల నిర్వహణకు ప్రభుత్వం మంజూరు చేసిన రూ.25 వేల నగదును కుటుంబ సభ్యులకు అందజేశారు. మృతుడికి భార్య, అరుగురు సంతానం.

‘బయో’ కొంటేనే ఎరువులు

- మన గ్రోమోర్ సెంటర్ నిర్వాకం
- డీఏపీ కృత్రిమ కొరత సృష్టిస్తున్న వైనం
- రైతులపై అదనపు భారం
- పట్టించుకోని అధికారులు

రైతుల అవసరాలను ఆసరాగా మార్చుకుని కాసులు కుప్పేసుకోవడానికి కొందరు వ్యాపారులు పూనుకున్నారు. ప్రస్తుతం ఖరీఫ్‌లో భాగంగా విత్తనాలు వేసేందుకు రైతులు సిద్ధమవుతున్నారు. ఈ క్రమంలో వారికి అవసరమైన ఎరువులను కృత్రిమ కొరత సృష్టించి తాము సూచించిన బయో ఉత్పత్తులను కొంటేనే డీఏపీ, కాంప్లెక్స్ ఎరువులు ఇస్తామని షరతు పెడుతుండటంతో అన్నదాతలు అవాక్కవుతున్నారు. తమకు బయో ఉత్పత్తి అక్కర్లేదని చెబుతున్నా.. వినిపించుకోవడంలేదు. అయితే అన్నీ తెలిసిన అధికారులు మిన్నకుండిపోవడం విమర్శలకు తావిస్తోంది.

దేవనకొండ: కొందరు వ్యాపారులు లాభాలే ధ్యేయంగా ఎరువుల కొరత సృష్టిస్తున్నారు. మన గ్రోమోర్ కేంద్రాలు దేవనకొండ, తెర్నెకల్‌లో మాత్రమే ఉన్నాయి. చుట్టుపక్కల 44 గ్రామాల ప్రజలు సమీపంలో ఈ కేంద్రాలకే వస్తున్నారు. ప్రస్తుతం రైతులు విత్తనాలు వేస్తున్నారు. ఈ క్రమంలో వారికి అవసరమైన డీఏపీ, కాంప్లెక్స్ ఎరువులు కొనుగోలు చేయడానికి కేంద్రాలకు వెళ్తే బయో ఉత్పత్తి కొనాలని షరతు విధిస్తున్నారు.

పత్తి, వేరుశనగ, మిరప సాగు..

పత్తి, వేరుశనగ, మిరప తదితర పంటల్లో మొదటి దఫా ఎరువుగా వాడే డీఏపీని మన గ్రోమోర్ కేంద్రం యజమానులు కృత్రిమ కొరత సృష్టిస్తున్నారు. ఒక డీఏపీ బస్తా విలువ రూ.1350, ఒక బస్తా డీఏపీ కొనాలంటే వారి కంపెనీ బయో ప్రోడక్ట్ ఒక బస్తా కొనాల్సిందేనని షరతు పెడుతున్నారు. ఈ బయో ఉత్పత్తి విలువ దాదాపు రూ.700. నాలుగు ఎకరాల గల రైతు ఎకరాకు నాలుగు బస్తాల డీఏపీకి రూ.5400 ఖర్చు అవుతుంది. అయితే వారి కంపెనీ బయో ఉత్పత్తి కొనాలంటే నాలుగు సంచులకు అదనంగా రూ.2,800 ఖర్చు చేయాల్సి వస్తోంది. ఇలా వందల మంది రైతులకు వారి కంపెనీ బయో బస్తాలను బలవంతంగా అంటకడుతూ లక్షలాది రూపాయలను సొమ్ము చేసుకుంటున్నారు. సంబంధిత వ్యవసాయ అధికారులకు విషయం తెలిసినా చర్యలు చేపట్టకపోవడం అనుమానాలకు తావిస్తోంది. కేవలం తూతూ మంత్రంగా తనిఖీలు నిర్వహించి చేతులు దులుపుకుంటున్నారని ఆరోపణలున్నాయి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఏ ఎరువులు కావాలన్నా రైతు భరోసా కేంద్రాల్లో పుష్కలంగా అందుబాటులో ఉండేవి. నేడు రైతు సేవా కేంద్రాల్లో యూరియా తప్పా కాంప్లెక్స ఎరువులు లభించడం లేదు. దీన్ని అవకాశంగా తీసుకొని వ్యాపారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తుండటంతో రైతన్నలు ఇబ్బందులు పడుతున్నారు.



దేవనకొండలోని మన గ్రోమోర్ కేంద్రం

బయో మందులు కొనకపోతే డీఏపీ బస్తా ఇవ్వడం లేదు



గత ప్రభుత్వ హయాంలో ఎరువులు రైతు భరోసా కేంద్రాల్లో పుష్కలంగా లభించేవి. ప్రభుత్వం రైతు భరోసా కింద అందజేసిన డబ్బులతో ఎరువులను కొనేవాళ్లం. ఇప్పుడు దుకాణాదారులు అంటగటే బయో ఉత్పత్తులకు వ్యవసాయ ఖర్చు రెండింతలు అవుతోంది. ఏమి చేయాలో తెలియని పరిస్థితి. అధికారులు స్పందించాలి. – పెద్దారెడ్డి, రైతు, కొత్తపేట గ్రామం

డీఏపీ ఎరువుకు బయో ప్రొడక్ట్ అంటగట్టడం సరికాదు



నాకు 20 ఎకరాల పొలం ఉంది. దీని తోట సాగు చేశా. మిగిలిన పొలంలో ఉల్లి, మిరప, పత్తి పంటలు సాగుచేశా. పంటలకు ప్రస్తుతం డీఏపీ చాలా అవసరం. కేవలం మన గ్రోమోర్ కేంద్రంలో మాత్రమే డీఏపీ లభిస్తుంది. అక్కడి నిర్వాహకులు ఒక డీఏపీ బస్తాకు వారికి సంబంధించి ఒక బయో ప్రొడక్ట్‌ను తప్పనిసరిగా తీసుకోవాలని షరతు పెడుతున్నారు. దీంతో చేసేదేమి లేక అవసరం లేకపోయినా బయో కొంటున్నాం. మా బాధలు ప్రభుత్వానికి పట్టడం లేదు. – కోటేశ్వరనాయుడు, రైతు, బేతపల్లి గ్రామం

ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం



ఏ యాజమాన్యమైనా కాంప్లెక్స్ ఎరువులకు వారి కంపెనీ బయో ఉత్పత్తులను బలవంతంగా అంటగట్టరాదు. ఒకవేళ అంటగడితే తమకు ఫిర్యాదు చేస్తే, విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటాం. రైతులకు కావాల్సిన ఎరువులను ఎమ్మార్పీకే యాజమాన్యం అందిస్తాయి. అలా కాదని అధిక ధరలకు విక్రయించినా, ఇతర మందులను అంటగట్టినా చర్యలు తీసుకుంటాం. – సురేష్‌బాబు, మండల వ్యవసాయాధికారి

బోధన పరికరాల అందజేత

మద్దికెర : స్థానిక డీపీఈపీ పాఠశాలలో ప్రవాస భారతీయుడు డాక్టర్ గోరంట్ల వాసుబాబు రూ.30 వేలు విలువజేసే బోధన పరికరాలను శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ గోపాల్ మాట్లా డుతూ విద్యాభివృద్ధి కృషి చేయడం అభినందనీయమన్నారు. ప్రభుత్వంతో పాటు దాతులు సహకరిస్తున్నారని, విద్యార్థులు బాగా చదవాలని సూచించారు. హెచ్‌ఎం ఆంజనేయులు, ఉశేనప్ప, రంగన్న, రామాంజనేయులు, మధుబాబు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

హొళగుంద: మార్లమడికి వద్ద ఉన్న వేదావతి నది నుంచి ఇసుకను తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను హొళగుంద పోలీసులు పట్టుకున్నారు. ఆలూరు, అరికెర గ్రామాలకు చెందిన వ్యక్తులు నదిలో అక్రమంగా ఇసుకను తవ్వుకుని తీసుకెళ్తున్నారనే సమాచారం మేరకు ఎస్‌ఐ పెద్దయ్య నాయుడు, సిబ్బందితో కలిసి దాడి చేసి ట్రాక్టర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. వాటిని రెవెన్యూ అధికారులకు అప్పగిస్తామని, తదుపరి చర్యలు వారు తీసుకుంటారని ఎస్‌ఐ చెప్పారు.

వర్షం కురవాలని..

కృష్ణగిరి: వరుణదేవా కరుణ చూపవా అంటూ మండలంలోని సంగాల గ్రామస్తులు శనివారం గ్రామ దేవతలకు 101 బిందెల నీటితో జలాభిషేకం చేశారు. గ్రామంలోని సుంకులమ్మ అమ్మవారితో పాటు నాభిశిలకు నీటిని పోసి ప్రత్యేక పూజలు చేశారు. ఇలా చేస్తే వర్షాలు కురుస్తాయనే నమ్మకంతో చేపట్టినట్లు గ్రామస్తులు తెలిపారు. కాగా..సాయంత్రం ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమై జల్లులు పడ్డాయి. ఖరీఫ్‌లో సాగు చేసిన పంటలకు నెల రోజులుగా వర్షాలు లేక ఎండుతున్న సమయంలో ఈ జల్లులతో కొంత ఉపశమనం కలుగుతుందని వారు సంతోషం వ్యక్తం చేశారు.

మొహర్రం సందడి షురూ

- గ్రామాల్లో కొలువుదీరిన పీర్లు
- మొదలైన సరిగెత్తులు



జొన్నగిరి పీర్ల చావిడిలో కొలువుదీరిన పీర్లు

తుగ్గలి : త్యాగానికి ప్రతీకగా నిలిచే మొహర్రం వేడుకలతో గ్రామాల్లో సందడి నెలకొంది. ప్రజలంతా కలిసిమెలిసి నిర్వహించుకునే ఈ పండుగ ఈనెల 7వ తేదీన ప్రారంభమైంది. వేడుకల్లో భాగంగా గ్రామాల్లో పీర్లు కొలువుదీరాయి. పట్టువస్త్రాలు, బంగారు, వెండి నగలు, పూలతో పీర్లను అలంకరించారు. పీర్ల చావిళ్ల ముందు అగ్ని గుండాలు ఏర్పాటు చేశారు. వేడుకల్లో ఆదివారం చిన్నసరిగెత్తు, 16న పెద్ద సరిగెత్తు, 17న పీర్లను ఏటికి తరలిస్తారు. చావిళ్ల ముందు ఏర్పాటు చేసిన అగ్ని గుండాల చుట్టూ తప్పెట్ల మోతలకు అనుగుణంగా సాహుసేన్ అంటూ చిందులేస్తున్నారు. పండుగలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా జొన్నగిరి ఎస్‌ఐ చంద్ర, తుగ్గలి ఇన్‌చార్జ్ ఏఎస్‌ఐ చెన్నయ్య సిబ్బందితో గ్రామాల్లో పర్యటిస్తున్నారు.

ఘనంగా దస్తగిరిస్వామి సరిగెత్తు

వెల్దుర్తి(కృష్ణగిరి): పీర్ల పండుగను పురస్కరించుకుని మండలంలోని అల్లుగుండు గ్రామంలో శనివారం రాత్రి దస్తగిరి స్వామి సరిగెత్తు ఘనంగా నిర్వహించారు. విద్యుదీపాల వెలుగుల్లో పీర్లచావిడిలో కొలువైన దస్తగిరిస్వామి, ఇతర పీర్లను నిర్వాహకులు తలారి మాబు, మహబూబ్ హుసేన్, హాఫిజ్, దస్తగిరి కుటుంబసభ్యులు ప్రత్యేకంగా అలంకరించారు. మండలం నుంచే కాక ఇతర ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామివారికి ప్రత్యేక ఫాతెహాలు నిర్వహించారు. సరిగెత్తును పురస్కరించుకుని గ్రామ వీధుల్లో ఆదివారం ఉదయం వరకు పీర్ల సవారి సాగనుంది. రాత్రంతా చావిడి ముందు తవ్విన అగ్నిగుండం చుట్టూ సాహుసేన్ అంటూ చిందులు తొక్కారు.



అల్లుగుండులో ఫాతెహాలు నిర్వహిస్తున్న భక్తులు

మొహర్రం వేడుకలు ప్రశాంతంగా జరుపుకోవాలి

హాలహర్వి: మొహర్రం వేడుకలను ప్రశాంతంగా జరుపుకోవాలని ఆలూరు సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు. శనివారం మండలంలోని నిట్రవట్టి గ్రామంలో ప్రజలతో సమావేశమైన సీఐ పలు సూచనలు చేశారు. మత సామరస్యానికి ప్రతీకగా మొహర్రం జరుపుకుంటారన్నారు. ఎలాంటి అల్లర్లు, గొడవలు జరగకుండా ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని చెప్పారు. ఏవైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని కోరారు. ఎస్‌ఐ నరేంద్ర, కానిస్టేబుళ్లు గోవర్ధన, నాయక్, ఉన్నారు.



నిట్రవట్టిలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న సీఐ వెంకటేశ్వర్లు

అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు

హొళగుంద: మొహర్రం వేడుకల్లో ఎవరైన గొడవలకు దిగితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ పెద్దయ్యనాయుడు హెచ్చరించారు. శనివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో మార్లమడికి, ఎండీ హళ్లి, ముద్దటమాగి తదితర గ్రామస్తులతో మాట్లాడారు. చిన్న సరిగెత్తు, పెద్ద సరిగెత్తు, పీర్ల నిమజ్జనంలో భాగంగా ఊరేగింపును ప్రశాంతంగా జరుపుకోవాలని సూచించారు. అల్లర్లకు పాల్పడే వారిపై ఇప్పటికే నిఘా ఉంచామని చెప్పారు.

మొహర్రం ఉత్సవాలపై పోలీసుల ఆంక్షలు



ఇసుక ట్రాక్టర్లును సీజ్ చేసిన దృశ్యం

ఆస్పరి: శాంతి భద్రతల దృష్ట్యా మండలంలోని ఆస్పరి, బిల్లేకల్లు, ముత్తుకూరు, కారుమంచి, హలిగేర గ్రామాల్లో మొహర్రం వేడుకలపై ఆంక్షలు విధించినట్లు సీఐ హనుమంతప్ప తెలిపారు. శనివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలంలో ఐదు సమస్యాత్మక గ్రామాలను గుర్తించామన్నారు. ఆయా గ్రామాల్లో సావ్‌సేన్ ఆడేందుకు అనుమతి లేదన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించకుండా అదనంగా 80 మంది పోలీసులు బందోబస్తు నిమిత్తం రానున్నారని చెప్పారు. గ్రామాల్లోని పీర్ల చావిళ్ల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే..అక్రమంగా ఇసుకను తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లును సీజ్ చేసి కేసు నమోదు చేశామని తెలిపారు. అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ముఖద్వార నిర్మాణానికి భూమి పూజ

తుగ్గలి : మండలంలోని హుసేనాపురం గ్రామానికి వెళ్లే దారిలో ముఖద్వార నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. సర్పంచ్ మస్తాన్‌బీ, సుల్తాన్ శనివారం ముఖద్వార నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు బొజ్జులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

గుండమ్మ హంతకులను శిక్షించాలి

ఆస్పరి: ఆదోని మండలం నాగనాథహళ్లి గ్రామంలో దళిత మహిళ గుండమ్మను అధికార పార్టీ ప్రాద్బలంతోనే హత్య చేశారని, నిందితులను కఠినంగా శిక్షించాలని మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు మహానంది డిమాండ్ చేశారు. శనివారం ఆస్పరిలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పొలం తగదా విషయంలో హత్య చేయడం దుర్మార్గమన్నారు. మృతురాలి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. వీరేష్, రంగస్వామి, బంగారు, హరికృష్ణ పాల్గొన్నారు.

పశువులకు టీకాలు తప్పనిసరి

హాలహర్వి: మండలంలోని ఆవులు, ఎద్దులకు ముద్దచర్మ వ్యాధి టీకాలు యుద్ధ ప్రాతిపదికన వేస్తున్నట్లు పశు వైద్యాధికారి అశోక్‌కుమార్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ గొర్రెలు, మేకలకు నీలి నాలుక వ్యాధి నివారణ టీకాలు కూడా వేస్తున్నామని చెప్పారు. ఇంకా ఎవరి పశువులకైనా టీకాలు వేయకపోతే వెంటనే వేయించాలని సూచించారు. పశువులు ఆరోగ్యంగా ఉండేలా చూసుకోవాలన్నారు.

అంగన్‌వాడీ వర్కర్స్ నూతన కమిటీ ఎన్నిక



మాట్లాడుతున్న జె.లలితమ్మ

వెల్దుర్తి(కృష్ణగిరి): ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ వెల్దుర్తి ప్రాజెక్ట్ నూతన కమిటీ ఎన్నిక శనివారం వెల్దుర్తి సీడీపీఓ కార్యాలయ భవనంపై ఏకగ్రీవంగా జరిగింది. అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జె.లలితమ్మ, కర్నూలు జిల్లా అధ్యక్షురాలు ఎస్.చాందిని ఆధ్వర్యంలో వెల్దుర్తి, కృష్ణగిరి మండలాలు కలిసి ఉన్న వెల్దుర్తి ప్రాజెక్ట్ అధ్యక్షురాలిగా వెల్దుర్తి మండలం గువ్వలకుంట్ల సంధ్యారాణి, ప్రధాన కార్యదర్శిగా కృష్ణగిరి మండలం మాదాపురం యు.సుజాత ఎన్నికయ్యారు. ఏఐటీయూసీ వెల్దుర్తి మండల అధ్యక్షుడు మాధవస్వామి గౌరవాధ్యక్షుడిగా ఎన్నికకాగా, ఉపాధ్యక్షులుగా వెల్దుర్తి మండలం కలుగొట్ల శాంత, కృష్ణగిరి మండలం టి.గోకులపాడు జి.యశోద, సహాయ కార్యదర్శులు, కమిటీ సభ్యులుగా రెండు మండలాలకు చెందిన గోవర్ధనగిరి నాగమద్దమ్మ, వెల్దుర్తి రేణుక, ఎప్సిబా, కృష్ణగిరి స్వర్ణలత, పుష్పావతి, కంబాలపాడు శంకరమ్మ, సురేఖ, వెల్దుర్తి షమీనా, రామలక్ష్మి, లక్ష్మీదేవి, పద్మ, సుగుణ, మహేశ్వరిని ఎన్నుకున్నారు. ఎస్.ఈదమ్మ, రెండు మండలాల అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

హామీల అమలుకు పోరాడండి



ఎమ్మెల్యే బాలనాగిరెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న కొత్తకాపు మధుసూదన్‌రెడ్డి

దేవనకొండ: కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చేలా ఒత్తిడి చేయాలని వైఎస్సార్‌సీపీ జిల్లా ట్రెజరీ ప్రధాన కార్యదర్శి కొత్తకాపు మధుసూదన్‌రెడ్డి కోరారు. శనివారం మంత్రాలయం ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డిని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో వైఎస్సార్ తరఫున ఆలూరు నుంచి బి.విరూపాక్షి, మంత్రాలయం నుంచి బాలనాగిరెడ్డి ఎమ్మెల్యేలుగా గెలుపొందారన్నారు. కర్నూలు జిల్లా అభివృద్ధి, జిల్లాలోని పెండింగ్ ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేసేలా పోరాడాలని కోరారు. ఎంపీటీసీ నామాల శ్రీనివాస్, వైస్ సర్పంచ్ వీరన్న, పురుషోత్తంరెడ్డి, చాకలి తిమ్మప్ప, దుమ్ము హనుమంతు, చంటి పాల్గొన్నారు.

ఊరి బాగు కోసం..

వెల్దుర్తి(కృష్ణగిరి): తమ ఊరి బాగు కోసం కులమతాలకతీతంగా నడుముకట్టారు ఆ యువకులు. వెల్దుర్తి మండలం రత్నపల్లె గ్రామంలో దస్తగిరి కట్ట ఉంది. మహా వృక్షానికి కట్ట కట్టి ఉండగా, అక్కడ వెలసిన దస్తగిరి స్వామి దర్గాకు గ్రామస్తులు కులమతాలకతీతంగా పూజలు నిర్వహిస్తారు. సంప్రదాయంలో భాగంగా దర్గా వద్ద వెదురు బొంగుకు ఆకుపచ్చ జెండా కట్టి ఉంచాలి. అయితే వృక్షానికంటే పెద్దదైన బొంగు ఉంచితే ఊరికి మంచిదని మత పెద్దలు, గ్రామ పెద్దలు సూచించారు. ఇందుకు 60 అడుగుల వెదురు బొంగు అవసరమైంది. ఈ బొంగు తెచ్చేందుకు గ్రామానికి చెందిన 15 మంది యువకులు ముందుకొచ్చారు. బొంగు కోసం గురువారం శ్రీశైలం సమీపంలోని నల్లమల అడవికి వెళ్లారు. అక్కడి అటవీ శాఖ అధికారులకు రూ.2,500 చలానా చెల్లించి 60 అడుగుల వెదురు బొంగు సేకరించారు. అనంతరం భక్తి శ్రద్ధలతో అక్కడి నుంచి కాలినడకన వెదురుబొంగును మోస్తూ శనివారం రాత్రి రత్నపల్లె చేరుకున్నారు. బొంగును తీసుకొచ్చిన శ్రీను, రామానాయుడు, మౌలాలి, మధు, చిన్న, విజయ్, రాము, రవి, మద్దిలేటి, బైరెడ్డి, వెంకట్రాముడును గ్రామస్తులు అభినందించారు.



శ్రీశైలం నుంచి వెదురుబొంగును మోస్తూ కాలినడకన రత్నపల్లెకు చేరుకున్న యువకులు

ఆర్టీసీ స్థలాల లీజుపై అవగాహన

ఆదోని టౌన్: ఆదోని ఆర్టీసీ డిపో పరిధిలో ఖాళీగా ఉన్న 1.30 ఎకరాల ఖాళీ స్థలం లీజుపై శనివారం డిపోలో డీఎం రఫిక్‌అహ్మద్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. సమావేశంలో పట్టణంలోని వ్యాపారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా ప్రజారవాణాధికారి శ్రీనివాసులు, ఈఈ ఈశ్వరయ్య, అసిస్టెంట్ మేనేజర్ రాఘవేంద్ర వ్యాపారులకు అవగాహన కల్పించారు. డిపో పరిధిలో 1.30 ఎకరాలు ఖాళీ స్థలం ఉందని జిల్లా ప్రజారవాణాధికారి శ్రీనివాసులు తెలిపారు. ఈ స్థలాన్ని లీజుకు ఇవ్వనున్నామని, వ్యాపారులకు ఏయే ప్రాంతం అనుకూలంగా ఉంటుందో చూసుకుని లీజు పొందవచ్చని చెప్పారు. తొందరలోనే వ్యాపారులు తమ అభిప్రాయాలను తెలియజేయాలని కోరారు.

పొంచి ఉన్న ప్రమాదం

ఆలూరు రూరల్: పట్టణంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ తీగలు ప్రమాదకరంగా ఉన్నాయి. ఆ శాఖ అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రమాదం పొంచి ఉంది. కర్నూలు–బళ్లారి రోడ్డులో ఇళ్లకు కర్రల సహాయంతో విద్యుత్ కనెక్షన్ తీసుకోవడంతో వైర్లు కిందకు వేలాడుతున్నాయి. వర్షాకాలం కావడంతో చేతికందే ఎత్తులో ఉండటంతో ప్రమాదం చోటు చేసుకునే అవకాశముందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొన్నేళ్లుగా విద్యుత్ స్తంభాలు మంజూరు చేయాలని అధికారులకు కోరినా పట్టించుకోవడం వారు మండిపడుతున్నారు. ప్రమాదం జరగకముందే అధికారులు నిర్లక్ష్యాన్ని వీడి స్తంభాలు మంజూరు చేసి తీగలు సరిచేయాలని కోరుతున్నారు.



కర్నూలు-బళ్లారి రోడ్డులో కర్ర సహాయంతో ఉన్న విద్యుత్ తీగలు

గొంతులెండుతున్నాయ్!

- అడుగంటిన కాజీపురం జలాశయం
- రెండు వారాలకొకసారి నీటి సరఫరా
- తీవ్ర నీటి ఎద్దడి ఎదుర్కొంటున్న పలు గ్రామాలు
- చోద్యం చూస్తున్న అధికారులు

చిప్పగిరి: ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా గుక్కెడు నీటి కోసం వారాల తరబడి వేచి చూడాల్సిన దుస్థితి మండలంలో నెలకొంది. చిప్పగిరి, కాజీపురం, బెల్డోణ జలాశయాలు మండలానికి ప్రధాన నీటి వనరులు. చిప్పగిరి జలాశయం నీటిని పత్తికొండకు సరఫరా చేస్తుండగా.. మండలంలో ఉన్నప్పటికీ ప్రయోజనం లేకుండా పోయింది. ఇక బెల్డోణ జలాశయం నీరు కేవలం బెల్డోణ గ్రామానికి మాత్రమే అందుబాటులో ఉంది. ప్రస్తుతం అందులో కూడా నీరు కనిష్ఠ స్థాయికి చేరువగా ఉంది. మిగిలిన కాజీపురం జలాశయం నుంచిచిప్పగిరితో పాటు గుమ్మనూరు, కాజీపురం, కొట్టాల, బంటనహాలు, ఏరూరు,కుందన గుర్తి తదితర గ్రామాలకు నీరు అందుతుంది. ప్రస్తుతం జలాశయం అడుగంటడంతో ఆయా గ్రామాలకు రెండు వారాలకు ఒకసారి నీటిని విడుదల చేస్తున్నారు. అవి కూడా రంగుమారి, దుర్వాసన వస్తున్నాయని ప్రజలు వాపోతున్నారు. తప్పని పరిస్థితిలో ఆ నీటిని తాగిన వారు రోగాలబారిన పడుతున్నారు. నీటి సరఫరా లేకపోవడంతో ప్రజల ఇబ్బందులు వర్ణనాతీతం. కాజీపురం జలాశయాన్ని హెచ్‌ఎల్సీ ద్వారా పూర్తిస్థాయిలో నింపకపోవడం వల్లే ఈ దుస్థితి తలెత్తిందని ఆయా గ్రామాల ప్రజలు మండిపడుతున్నారు. జలాశయాల్లో నీటి నిల్వలు పడిపోతుంటే ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు ఏమి చేస్తున్నారని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ట్యాంకర్ల ద్వారా నీటిని అందించాలని కోరుతున్నారు.



అడుగంటిన కాజీపురం జలాశయం